క్లుప్తంగా

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



ఖలీల్‌వాడి: నగర సీపీ ఆదేశాల మేరకు రెండో టౌన్ పరిధిలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించినట్లు ఎస్సై యాసీన్ అరాఫత్ శనివారం తెలిపారు. అనుమానిత ప్రదేశాలలో డాగ్ స్క్వాడ్‌తో చెకింగ్ చేశారు. నేరాలను అదుపు చేయడం కోసం ప్రజలను చైతన్యవంతులు చేసే కార్యక్రమాలు కూడా నిర్వహించినట్లు చెప్పారు.

అదనపు ఫీడర్ ప్రారంభం



ఆర్యనగర్-1లో ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఏడీఈ ఆర్ చంద్రశేఖర్

సుభాష్‌నగర్: నగరంలోని ఆర్యనగర్-1 పరిధిలో అదనపు ఫీడర్‌ను టౌన్ ఏడీఈ ఆర్ చంద్రశేఖర్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా అందించేందుకు, ఓవర్ లోడ్ తగ్గించేందుకు సీఎండీ సూచనల మేరకు అదనపు ఫీడర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీ-4 సెక్షన్ ఏఈ గంగాశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీపీకి పరామర్శ



పరామర్శిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పరామర్శించారు. ఏసీపీ రాజా వెంకటరెడ్డి తల్లి లక్కిడి రాజమణి ఇటీవల మృతి చెందారు. దీంతో నిర్మల్‌లోని నివాసంలో ఏసీపీని ఎమ్మెల్యే కలిసి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉమ్మాజీ నరేష్, బాగిర్తి బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



సాహితిని అభినందిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్: మల్కాపూర్ తండాకు చెందిన సాహితి అనే విద్యార్థిని ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచినందుకు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సోమవారం అభినందించారు. సాహితికి 989 మార్కులు వచ్చాయని, విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు తారాచంద్ నాయక్, బాగిర్తి బాగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పైసా ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు..



ప్రదీప్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

మోపాల్: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మండల ప్రజాపరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కుమార్‌ను ఎంపీడీవో రాములు నాయక్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో సహా ఎంపీవో, మండల పరిషత్ సిబ్బంది పూలమాల, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సిబ్బంది భోజన్న, సాగర్, సునీత, సరిత, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

‘యువ వికాసం’ దరఖాస్తుల పరిశీలన

- బల్దియాలో డివిజన్ల వారీగా వివరాలు సేకరిస్తున్న అధికారులు
- దరఖాస్తుదారులను ప్రభావితం చేస్తున్న మాజీ కార్పొరేటర్లు
- చెప్పినట్లుగా రిపోర్టు ఇవ్వాలని వేధిస్తున్న వైనం



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ‘రాజీవ్ యువ వికాసం’పథకానికి సంబంధించి బల్దియాలో అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు.నగరంలోని 60డివిజన్‌లలో బల్దియా సిబ్బంది దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నారు. దరఖాస్తులో పేర్కొన్నవిధంగా వారి సర్టిఫికెట్లు ఇతర వివరాలు రూఢీ చేసుకుంటున్నారు. అయితే సిబ్బందికి క్షేత్రస్థాయిలో స్థానిక నేతలు, మాజీ కార్పొరేటర్లతో తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ, వికలాంగ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరుచేయనుంది. ఇందుకుగాను నిరుద్యోగ యువకుల వద్ద నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సేకరించారు. వాటిని బల్దియా కార్యాలయంలో దరఖాస్తుదారులు అందజేశారు. మొత్తం 20 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. వీటిని కార్పొరేషన్‌ల వారీగా వేరుచేసే ప్రక్రియ నిర్వహించారు. వీటిని సంబంధిత దరఖాస్తుదారుల వద్దకు నేరుగా వెళ్లి వారు జతపరిచిన సర్టిఫికెట్లను ధృవీకరించనున్నారు. దరఖాస్తుదారు ఇచ్చిన వివరాల స్వయంగా చూసి నివేదిక ఇవ్వవలసి ఉంది.

మాజీ కార్పొరేటర్ల ఒత్తిడి..

రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ప్రజాప్రతినిధులు ముఖ్యంగా మాజీ కార్పొరేటర్లు ప్రభావితం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో విచారణకు వచ్చిన సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటనలు తలెత్తుతున్నాయి. ఆయా డివిజన్‌లలో దరఖాస్తుదారుల వివరాలు సేకరించడానికి వచ్చిన అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. దరఖాస్తుదారుల జాబితా తమకు ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. తమకు తెలియకుండా ఎందుకు విచారణకు వచ్చారని నిలదీస్తున్నారు. దరఖాస్తుదారులను తమ ఇంటి వద్దకే పిలిపిస్తామని, అక్కడే వివరాలు సేకరించాలని పట్టుపడుతున్నారు. దాంతో క్షేత్రస్థాయిలో విచారణకు వచ్చిన అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అధికారులు మాత్రం దరఖాస్తుదారులు ఇచ్చిన అడ్రస్‌కు నేరుగా వెళ్లి వారి సర్టిఫికెట్లు ఒరిజనల్ లేక డూప్లికేటా అని తనిఖీ చేయాలని, వారి ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని రిపోర్టు ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయి. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని డివిజన్‌లలో మాజీ కార్పొరేటర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారికి సంబంధించిన వారి పేర్లు విచారణ లేకుండానే ఓకే చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇతర పెద్ద నాయకులతో ఫోన్‌లలో మాట్లాడిస్తున్నారు. దాంతో విచారణ ప్రక్రియ సజావుగా సాగడం లేదు. అటు అధికారులకు చెప్పుకోలేక, ఇటు మాజీ కార్పొరేటర్లు చెప్పినట్లు రిపోర్టు ఇవ్వలేక దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ అంశంపై ఉన్నతాధికారులు క్లారిటీ ఇవ్వాలని, ఇందులో ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఒత్తిడులకు లొంగొద్దు



యువ వికాసం దరఖాస్తుదారుల వెరిఫికేషన్ పారదర్శకంగా సాగాలి. ఇందులో ఎవరి ఒత్తిడులకు లొంగొద్దు. వాస్తవ పరిస్థితులు గమనించి నివేదిక ఇవ్వాలి. జిల్లా కలెక్టర్ ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులుంటే వెంటనే నా దృష్టికి తీసుకురావాలి.

– దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, నిజామాబాద్

కర్రెగుట్టలో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపాలి



మాట్లాడుతున్న మాస్‌లైన్ నేత వెంకన్న

డిచ్‌పల్లి: చత్తీస్‌గఢ్ – తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో గల కర్రెగుట్ట ప్రాంతంలో నాలుగైదు రోజులుగా కొనసాగుతున్న నరమేధాన్ని ఆపేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) డివిజన్ కార్యదర్శి వెంకన్న డిమాండ్ చేశారు. వెంటనే కర్రెగుట్టపై కూంబింగ్ చేస్తున్న సాయుధ బలగాలను వెంటనే వెనక్కు రప్పించాలని కోరారు. సోమవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కర్రెగుట్ట ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ, గిరిజనులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్ పేరిట అమాయకులను హతమారుస్తున్నారని విమర్శించారు. ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి సాయాగౌడ్, డిచ్‌పల్లి మండల కార్యదర్శి మురళి, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్య, నాయకులు మోహన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

బలగాలను వెనక్కి రప్పించాలి

నిజామాబాద్ సిటీ: కర్రెగుట్టలో కేంద్ర బలగాలు ఆపరేషన్ కగారు పేరుతో చేస్తున్న నరమేధాన్ని వెంటనే నిలిపివేయాలని, బలగాలను వెనక్కి రప్పించాలని వక్తలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వామపక్ష నాయకులు, మేధావులు, పౌరసమాజం నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాసి, రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తుందని మండిపడ్డారు. ప్రకృతి సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం చేస్తున్న కుట్రగా అభివర్ణించారు. నాయకులు ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య, దాసు, శ్రీనివాస్, సుధాకర్, విఠల్‌గౌడ్, శివకుమార్, మల్లికార్జున్, వనమాల సత్యం పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళులు



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నేతలు

నిజామాబాద్ నాగారం: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకులకు మాల మహానాడు జిల్లా కమిటీ, టీమ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నివాళులర్పించారు. వారి ఆత్మ శాంతించాలని నిఖిల్ సాయి చౌరస్తా నుంచి పులాంగ్ వరకు కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చొక్కం దేవీదాస్, ప్రధాన కార్యదర్శి నాంది వినయ్, కోశాధికారి ఎ.రాజన్న, టీమ్ కన్వీనర్ ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లిలో మూసి ఉన్న దుకాణ సముదాయాలు

ధర్పల్లిలో సంపూర్ణ బంద్

ధర్పల్లి: పహల్గాం ఉగ్రదాడి ఘటనను ఖండిస్తూ ధర్పల్లి మండల కేంద్రంలో సోమవారం వ్యాపార, వాణిజ్య సంస్థలను నిర్వాహకులు స్వచ్ఛందంగా మూసివేసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ బంద్‌కు అన్ని పార్టీలు మద్దతునిచ్చాయి. ఈ అనాగరిక చర్యకు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన ఉండాలి

సైకియాట్రిస్ట్ ఆకుల విశాల్



విశాల్‌ను సన్మానిస్తున్న అస్సాం రాష్ట్రంలోని వైద్యులు

నిజామాబాద్‌నాగారం: ‘సైకియాట్రీ పీజీ విద్య పూర్తి చేసిన తర్వాత యువ మనోవైద్యులకు కచ్చితంగా కెరీర్‌పై అవగాహన ఉండాలని సైకియాట్రిస్ట్ ఆకుల విశాల్ అన్నారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తూర్పు రాష్ట్రాల యువ మనోవైద్య మహాసదస్సు అస్సాంలోని పోబిటోరా నేషనల్ పార్క్‌లో జరిగింది. ముఖ్యవక్తగా వైద్యులు విశాల్ ఆకుల హాజరై కెరీర్ అవకాశాలపై మాట్లాడారు. యువ మనోవైద్యులు ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ(ఐపీఎస్), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), నెహ్రూ యువ కేంద్రం వంటి సంస్థలతో చురుకుగా పని చేసి సమాజంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని ప్రధానంగా వివరించారు. అనంతరం ఆయనను నిర్వాహకులు సత్కరించారు.

కొనుగోళ్లు ప్రారంభించాలని రైతుల ఆందోళన



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి, గుత్ప గ్రామాలలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు కొనుగోళ్లు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ రెండు గ్రామాల రైతులు సోమవారం వేర్వేరుగా 63వ నంబర్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. డీసీవో డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలు ఉంటే లేబర్లు లేరని, లేబర్లు ఉంటే లారీలు లేవని, ఈ రెండు ఉన్నచోట ఖాళీ సంచులు, సుతిలీళ్లు లేవని ఆగ్రహిస్తూ సుమారు అరగంటకు పైగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రారంభంలో ఐకేపీ ద్వారా కాంటాలు జరిగి 4 లారీల ధాన్యం తీసుకెళ్లారని అన్నారు. తదనంతరం సొసైటీ ద్వారా కొనుగోలు జరుపుతామని చెప్పి ఐకేపీ సెంటర్‌ను తొలగించారన్నారు. ఒక వైపు వండగళ్ల వర్షాలు, వడగాల్పులు వచ్చే సమయం ఆసన్నమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సొసైటీ చైర్మన్, డీసీవో ఈ ఇద్దరిలో ఎవరికి ఫోన్ చేసినా ఎత్తడం లేదని మండిపడ్డారు. కలెక్టర్ కల్పించుకుని కొనుగోలు కేంద్రాల్లో కాంటాల వేగం పెంచి ధాన్యాన్ని వెను వెంటనే రైస్‌మిల్లుకు తరలించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని ధర్నా విరమింపజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల రీసర్వే నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారులను నియమించారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరుగుతున్న సర్వేను అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. దగ్గరుండి పర్యవేక్షించారు. దరఖాస్తుదారుల నుంచి వస్తున్న స్పందనను అడిగి తెలుసుకున్నారు. వారి అనుమానాలను వెంటనే నివృత్తి చేయాలని, సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రొసీడింగ్స్ ఇచ్చేలా చూడండి

నిజామాబాద్ సిటీ: తాజాగా రాజీవ్ యువ వికాసం సర్వే చేస్తున్న అధికారులకు రిసోర్స్ పర్సన్స్(ఆర్పీలు) సహకరించాలని సూచించారని, అయితే ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ప్రభుత్వం ఇచ్చేలా చూడాలని అదనపు కలెక్టర్ అంకిత్‌ను ఆర్పీలు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో వినతి పత్రం సమర్పించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి భరతలక్ష్మి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు వద్ద డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎల్ఎస్ఏ చైర్ పర్సన్, జిల్లా జడ్జి భరతలక్ష్మి సోమవారం ప్రారంభించారు. వేసవిలో కోర్టుతోపాటు వివిధ పనులకు వచ్చే వారికి చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బార్ అధ్యక్షుడు సాయారెడ్డి, మాణిక్ రాజ్ తదితరులు ఉన్నారు.

న్యాయం జరిపించాలి

ఆర్మూర్‌టౌన్: ఆస్తుల పంపకాల విషయంలో తమ కు న్యాయం జరిపించాలని ఆర్మూర్ మండలం అంకాపూర్‌కు చెందిన అంటి సాహితి అధికారులను కోరారు. ఆర్మూర్‌లోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తన భర్త శ్రీకాంత్, మరిది శ్రీధర్‌కు వారసత్వంగా వస్తున్న ఆస్తుల పంపకాల విషయంలో వీడీసీ జోక్యం చేసుకుని ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

మండల బీజేపీ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన మండల బీజేపీ కార్యవర్గ సభ్యులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ప్రభారి రాజన్న

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల బీజేపీ కార్యవర్గాన్ని సోమవారం నియమించినట్లు పార్టీ అధ్యక్షుడు చంద్రకాంత్ తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శిగా సురేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడిగా కర్ని రమణ, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా చౌకి లక్ష్మణ్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా స్రవంతి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా బదావత్ రవి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా కరుణాకర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, డిచ్‌పల్లి ప్రభారీ నాయుడు రాజన్న, మాజీ వైస్ ఎంపీపీ శ్యాంరావు, చిటికెల సుదర్శన్‌రెడ్డి, విష్ణు, అబ్బులు, బాలయ్య, గంగారెడ్డి, గాండ్ల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,100	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్	90,557		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	40	80
బెండకాయ	35	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	80	దోసకాయ	12	24
దొండకాయ	25	50	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	12	24
కాకరకాయ	35	60	గోబిపువ్వు	35	60
వంకాయ	20	40	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	60	100
మెంతికూర	70	100	చామగడ్డ	60	80
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80	మామిడికాయ	20	40

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 జింఖానా-11.00,4.40,7.40,10.30
- అర్జున్ సన్నాఫ్ వైజయంతి-1.40
- స్క్రీన్-2 సారంగపాణి జాతకం-10.40, 1.30, 4.30, 7.30, 10.30
- స్క్రీన్-3 చౌర్యపాఠం -11.0
- సూర్యాపేట జంక్షన్ -4.40, 10.20
- అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి -7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 సారంగపాణి జాతకం - 10.40, 1.30, 4.20, 7.10, 10.00
- స్క్రీన్-2 నె జహ-2(3డీ-ఇంగ్లిష్)-10.30, 7.40
- జింఖానా-1.40, 4.40
- తుడరుమ్-10.40
- స్క్రీన్-3 జింఖానా -11.25, 7.25 చౌర్యపాఠం - 2.20 అంటిల్‌డాన్(ఇంగ్లిష్)-5.00, 10.20
- స్క్రీన్ -4 అంటిల్‌డాన్-10.40
- అర్జున్ సన్నాఫ్ వైజయంతి-1.00,7.20
- తుడరుమ్-4.00 -జింఖానా-10.20

లలితామహల్ సారంగపాణి జాతకం

దేవి జింఖానా -11.00 2.00

అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి - 6.00 10.00

నటరాజ్ సూర్యాపేట్ జంక్షన్ (హిందీ)

విజయ్ ఓదెల

కనీస వేతనం కోసం పోరాడుదాం



మేడే పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం వచ్చేలా పోరాటాలు చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కె సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాకేంద్రంలో పలు సర్కిళ్లలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ) ఆధ్వర్యంలో మున్సిపల్ డ్రైవర్లు, కార్మికులు 139వ మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కె సుధాకర్ మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..

ఐఎఫ్‌టీయూ అనుబంధ సంస్థ వెజిటబుల్, ఆటో – మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వెజిటబుల్ ఆటో వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో నగర కమిటీ కార్యదర్శి మహాన్ మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 8 గంటల పనివిధానం అమలుచేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, మోటర్ రోడ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మోహన్, సురేష్, సద్దాం, అకలాక్ షబ్బీర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశాలకు సెలవు ఇవ్వాలి



అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నేతలు

నిజామాబాద్‌సిటీ: ప్రపంచ కార్మికుల దినోత్సవమైన మే డే రోజు ఆశ వలంటీర్లకు సెలవు ప్రకటించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవా రం జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు. అనంతరం నూర్జహాన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా ఆశ వాలంటీర్లు పాల్గొని విజయవంతం చేయనున్నారని తెలిపారు. మే డే సందర్భంగా ఆశ వర్కర్లకు క్యాన్సర్ సర్వే చేయాలని అధికారులు ఆదేశాలివ్వడం సరికాదన్నారు. సర్వే చేయాలనడం వారి హక్కులను హరించడమేనన్నారు. రాములు, శోభ, సీహెచ్ నర్స, శ్రీలత, లలిత పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధులు

రెంజల్(బోధన్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, పహల్గాం టెర్రరిస్టులను పట్టుకుని ఉరి తీయాలని ముస్లిం పర్సనల్‌లా బోర్డు ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం బోర్డు ప్రతినిధులతో పాటు మండలంలోని ముస్లింలు సాటాపూర్ చౌరస్తాలో సమావేశమయ్యారు. అక్కడి నుంచి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ తహసీల్ కార్యాలయం వరకు పాదయాత్రగా తరలివచ్చారు. కార్యాలయం ముందు బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లిం సమాజం ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తుందని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై చంద్రమోహన్‌కు అందించిన వినతి పత్రం ద్వారా తెలిపారు. ప్రతినిధులు మౌలానా ఖాలీద్‌బేగ్, అంజుంబేగ్, అబిద్‌బేగ్, మోసిన్‌బేగ్, హాజీఖాన్, ముఖీధ్, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.